సాక్షి
కుమురం భీం
శనివారం । 23 । మార్చి । 2024



తిరస్కరిస్తే పరిష్కారమైనట్లా?

రైతుల భూసమస్యలు పరిష్కారం కావడం లేదు. ధరణి ఆన్‌లైన్ రికార్డుల్లో మాత్రం పరిష్కారం చేసినట్లుగా గణాంకాలు వెల్లడవుతున్నాయి. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని: 6:29	ఆది: 4:54

గరిష్టం/కనిష్టం
37.6 /24.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వాత వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ డీఎం


కలెక్టర్‌ను సన్మానిస్తున్న డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్: ఇటీవల ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథ్ శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సన్మానించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంపై చర్చించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

'బీజేపీ హయాంలోనే అభివృద్ధి'


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నగేశ్

కాగజ్‌నగర్‌రూరల్: బీజేపీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందుతుందని, మరోసారి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కేంద్ర నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు మురళీధర్, కృష్ణకుమారి, విజయ్, కిరణ్, వీరభద్రచారి, సొల్లు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ప్లాంటేషన్ పనులు పరిశీలన


ప్లాంటేషన్ పరిశీలిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన రేంజ్ పరిధిలోని ధర్మారం బీట్‌లో ఈ సంవత్సరం కంపా నిధులతో చేపట్టిన ప్లాంటేషన్ పనులను శుక్రవారం కంపా ఏపీజీ కైలాస్ భీంరావ్ పరిశీలించారు. 50 హెక్టార్లలో కంపా నిధులతో ప్లాంటేషన్ పనులు పూర్తి చేసినట్లు రేంజ్ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఏపుగా పెరుగుతుండటంతో ప్లాంటేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. నిధులను వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అటవీ ప్రాంత అభివృద్ధి కోసం వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, రేంజ్ అధికారి నిజాముద్దీన్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, తక్కళ్లపల్లి సెక్షన్ ఆఫీసర్ రవీందర్, బీట్ అధికారి స్వాతి ఉన్నారు.

రైతులకు అండగా ఉంటాం

- 'మిర్చి రైతు విలవిల' కథనానికి స్పందించిన ఎమ్మెల్యే 'పాల్వాయి'
- నష్టం వివరాలు సేకరిస్తామని వెల్లడి



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్

కౌటాల(సిర్పూర్): అకాల వర్షాలతో నష్టపోయిన మిర్చి రైతులకు అండగా ఉంటామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'మిర్చి రైతు విలవిల' కథనంపై ఆయన స్పందించారు. అకాల వర్షంతో మిర్చి రైతులకు ఎంత మేరకు నష్టం జరిగిందో తెలుసుకుంటామని, క్షేత్రస్థాయిలో పూర్తి వివరాలు సేకరిస్తామని అన్నారు. కల్లాల్లో తడిసిన మిర్చి పంట విక్రయంలో అన్నదాతలకు ఎదురయ్యే ఇబ్బందులపై ఆరా తీశారు. నియోజకవర్గంలోని రైతులు పండించిన పంటను నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. వ్యవసాయాధికారుల నుంచి పూర్తి నివేదికలు తెప్పించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

తొలి కాత సంబురం!


రెబ్బెన మండలంలో సాగు అవుతున్న ఆయిల్ పామ్ తోట


మొదటిసారి కాసిన ఆయిల్‌పామ్ గెల



- కాత దశకు చేరుకున్న ఆయిల్‌పామ్
- వచ్చే ఏడాది నుంచి రైతులకు ఆదాయం
- అగ్రిమెంట్ ప్రకారం గెలల కొనుగోళ్లు
- జిల్లాలో 946 ఎకరాల్లో సాగు

ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు మునునూరి గోపి. రెబ్బెన మండలం దేవులగూడ గ్రామం. వాణిజ్య పంటలైన వేరుశనగ, బత్తాయి తోటల సాగు చేసే అతడు.. కొత్తగా ప్రయత్నించాలని రెండేళ్ల క్రితం జిల్లాలోనే మొదటిసారిగా ఎనిమిదెకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటాడు. ఉద్యానవన శాఖ అధికారుల ప్రోత్సాహంతో రెండో ఏడాది మరో 14 ఎకరాల్లో మొక్కలు నాటించాడు. మొదటి సంవత్సరం నాటిన మొక్కలు ప్రస్తుతం కాపుదశకు చేరుకున్నాయి. ప్రయోగాత్మకంగా చేపట్టిన సాగు విజయవంతం కావడంతో భవిష్యత్తులో సాగు విస్తీర్ణం మరింత పెంచేందుకు ఆసక్తి చూపుతున్నాడు.

రెబ్బెన(ఆసిఫాబాద్): సంప్రదాయ పంటల సాగుకు భిన్నంగా జిల్లా రైతులు ప్రయోగాత్మకంగా సాగు చేసిన ఆయిల్‌పామ్ పంట కాపుకొచ్చింది. ముందుగా సాగు చేసిన తోటల్లోని మొక్కలకు తొలి గెలలు పడ్డాయి. నాటిన నుంచి మూడేళ్ల వయస్సు వచ్చేసరికి చెట్లు కాతను అందుకుంటాయి. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్ సాగు విజయవంతం కావడంతో ఉద్యానవనశాఖ అధికారులు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మొదటి ఏడాది అంతంత మాత్రమే

జిల్లాలో 2022– 23 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ పామ్ తోటల సాగు ప్రారంభమైంది. మొదటగా రెబ్బెన, చింతలమానెపల్లి మండలాలకు చెందిన రైతులు ఆసక్తి చూపారు. సంప్రదాయ పంటల సాగుపై ఆధారపడిన రైతులు ధైర్యం చేసి మొదటిసారిగా ఆయిల్‌పామ్ తోటల వైపు దృష్టి సారించారు. ఉద్యానవన శాఖ అధికారులు తోటల సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు రైతులకు లాభాల గురించి అర్థమయ్యే రీతిలో వివరించారు. మొదటగా రెబ్బెనలో 8 ఎకరాలు, చింతలమానెపల్లిలో 12 ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ప్రసుతం ఇవి కాతదశకు చేరుకున్నాయి. అయితే మొదటి సంవత్సరం వచ్చిన కాత పెద్దగా ఆదాయం అందించడం లేదు. చెట్టుకు పోతు గెలలు అధికంగా ఉండి ఆడ గెలలు తక్కువగా ఉన్నాయి. గెల పరిమాణం సైతం తక్కువగా ఉంది. సాధారణంగా ఒక్కో గెల బరువు 30 నుంచి 60 కిలోల బరువు ఉంటుంది. మొదటి కాపులో వచ్చిన గెలలు కేవలం 2 నుంచి 5 కిలోల వరకు ఉండే అవకాశం ఉంది. తోటలో సుమారు వంద మొక్కలు నాటితే 30 నుంచి 40 మాత్రమే కాపునకు వచ్చాయి. నాలుగో ఏడాది నుంచి తోటంతా కాపునకు వచ్చి రైతుకు ఆదాయాన్ని తెచ్చిపెడతాయి. ప్రస్తుతం దిగుబడి కూడా ఎకరానికి 2 నుంచి 3 క్వింటాళ్లలోపే ఉంటుంది. దీనికితోడు మొక్కలు మరింత బలంగా ఉండేందుకు, కాండం దృఢంగా మారేందుకు మొదటి కాపు వదిలేయాలని అధికారులు సూచిస్తున్నారు. వచ్చే ఏడాది సుమారు 4 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని ఉద్యానవన అధికారులు అంచనా వేస్తున్నారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆరు, ఏడేళ్ల తర్వాత ఎకరానికి 8 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రసుత్తం టన్నుకు రూ.14,700 పలుకుతుంది. దాదాపు 30 ఏళ్లపాటు రైతు ఆదాయాన్ని పొందువచ్చు.

946 ఎకరాలకు విస్తరణ

ప్రారంభంలో జిల్లాలో 507 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేపట్టగా ప్రస్తుతం 946 ఎకరాలకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 1200 ఎకరాల్లో మొక్కలు నాటాలని ఉద్యానవన శాఖ అధికారులు లక్ష్యం పెట్టుకోగా.. 440 ఎకరాల్లో మాత్రమే నాటగలిగారు. అసెంబ్లీ ఎన్నికల ప్రభావం, ఏజెన్సీ ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం లేకపోవడం, ఉద్యానవన శాఖలో వేధిస్తున్న సిబ్బంది కొరతతో లక్ష్యాన్ని సాధించలేకపోయారు.

మ్యాట్రిక్స్ కంపెనీదే కొనుగోలు బాధ్యత

ఆయిల్ పామ్ దిగుబడిని అగ్రిమెంట్ ప్రకారం మ్యాట్రిక్స్ కంపెనీ కొనుగోలు చేస్తుంది. మార్కెట్ ధరను రైతులకు చెల్లిస్తుంది. తోటల సాగుకు ముందుకు వచ్చిన రైతులతో గతంలోనే మ్యాట్రిక్స్ కంపెనీ ముందస్తుగా అగ్రిమెంట్ చేసుకుంది. మూడో ఏడాది నుంచి కాపు మొదలు కాగా రైతులకు నష్టం చేకూర్చకూడదనే ఉద్దేశంతో అంతంత మాత్రంగా ఉన్న దిగుబడిని కొనుగోలు చేసి మార్కెట్‌కు తరలించకుండా వ్యవసాయ క్షేత్రంలోనే వదిలేస్తుంది. కొనుగోలు చేసిన దిగుబడికి మాత్రం రైతులకు డబ్బులు చెల్లిస్తుంది. నాలుగో ఏడాది నుంచి దిగుబడిని మార్కెట్‌కు తరలిస్తుంది.

మరో ఏడాది ఆగాల్సిందే..



జిల్లాలో మొదటగా సాగు చేసిన తోటలు మూడో ఏడాదిలోకి అడుగుపెట్టడంతో ఇప్పుడిప్పుడే కాత మొదలైంది. మొదటి కాపుతో రైతులకు పెద్దగా లాభం ఉండదు. అతి తక్కువ మొత్తంలో దిగుబడి వస్తుంది. మొక్కలు మరింత బలంగా మారేందుకు మొదటి సంవత్సరం కాపు కత్తిరిస్తాం. ఆ తర్వాత ఏడాది నుంచి వచ్చే దిగుబడిని మ్యాట్రిక్స్ కంపెనీ ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం రైతుల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తుంది. మార్కెటింగ్ కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం ఉండదు.

– ఎంఏ నదీం, జిల్లా ఉద్యానవన అధికారి

పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకుంటాం

- గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు
- భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతల నిర్మాణం
- జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్



ఆసిఫాబాద్‌అర్బన్: మరో ఎనిమిది రోజుల్లో 2023– 24 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. గ్రామ పంచాయతీ అభివృద్ధికి కీలకమైన పన్నుల వసూళ్లలో వందశాతం లక్ష్యం చేరుకునేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేస్తామని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. రోజువారీగా వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గురువారం 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి: జిల్లాలో పన్ను వసూళ్ల తీరు ఎలా ఉంది?

డీపీవో: జిల్లాలో మొత్తం 334 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం రూ.4.84 కోట్లు పన్నుల రూపంలో వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 86 శాతం లక్ష్యం చేరుకున్నాం. గడువులోగా మిగిలిన పన్నులు వసూలు చేస్తాం.

సాక్షి: వందశాతం లక్ష్యం చేరుకున్న పంచాయతీలు ఎన్ని ఉన్నాయి.. మిగిలిన వాటిల్లో పరిస్థితి ఎలా ఉంది?

డీపీవో: జిల్లాలో 209 జీపీలు వందశాతం లక్ష్యం చేరుకుని ఆదర్శంగా నిలిచాయి. ఆయా పంచాయతీల్లో రూ.1.62 కోట్ల పన్నులు వసూలు చేశాం. మరో 80 పంచాయతీల్లో 90 నుంచి 99 శాతం పన్నులు వసూలయ్యాయి. ఆయా జీపీల నుంచి రూ.1.10కోట్ల పన్ను వసూలు పూర్తయింది. సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ వసూళ్లు వేగవంతం చేస్తాం.

సాక్షి: గత ఆర్థిక సంవత్సరంలో ఏ మేరకు లక్ష్యం చేరుకున్నారు..?

డీపీవో: 2022– 23 ఆర్థిక సంవత్సరంలో రూ.4.73 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యం ఉండగా.. రూ.4.44 కోట్లు వసూలు చేశారు. 93.78 శాతం లక్ష్యం చేరుకున్నాం.

సాక్షి: వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది.. దానిని ఎలా అధిగమిస్తారు?

డీపీవో: వేసవిలో ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటాం. నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మిషన్ భగీరథ పథకం అధికారులతో కలిసి పని చేస్తున్నాం. నీటి కొరత ఏర్పడే ప్రాంతాలను గుర్తించి బోర్‌వెల్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

సాక్షి: నీటి సమస్యను పరిష్కరించేందుకు నిధులెలా సమకూరుస్తారు.?

డీపీవో: జిల్లా పరిస్థితుల దృష్ట్యా నీటి కష్టాలు ఎదురయ్యే ప్రాంతాలను గుర్తిస్తున్నాం. గ్రామ పంచాయతీ నిధుల నుంచే నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా కరువు పరిస్థితులు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. తక్షణమే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

సాక్షి: భూగర్భ జలాల పెంపుపై ప్రణాళికలు ఏంటి?

డీపీవో: భూగర్భ జలాల పెంపులో ఇంకుడు గుంతలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకు అవసరమైన కార్యాచరణను వేసవిలోనే ప్రారంభిస్తాం.

26న స్థాయీ సంఘాల సమావేశం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 26న స్థాయీ సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్థాయీ సంఘం– 7 (పనులు), స్థాయీ సంఘం– 1 (ప్రణాళిక, ఆర్థిక), మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు స్థాయీ సంఘం– 2(గ్రామీణాభివృద్ధి), మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు స్థాయీ సంఘం– 3(వ్యవసాయం), 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్థాయీ సంఘం– 4 (విద్య, వైద్యం), సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు స్థాయీ సంఘం– 5(మహిళా సంక్షేమం), 5 గంటల నుంచి 6 గంటల వరకు స్థాయీ సంఘం– 6 (సాంఘిక సంక్షేమం) సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశాలకు గౌరవ సభ్యులు, అధికారులు ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి

- ఎమ్మెల్సీ దండె విఠల్
- ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి పార్టీ కార్యాలయం ప్రారంభం


ఆత్రం సక్కుతో కలిసి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ విఠల్

బెజ్జూర్(సిర్పూర్): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ కోరారు. బెజ్జూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో అదిలాబాద్ ఎంపీగా ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వంద రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ హామీలను మర్చిపోయిందని, హామీల అమలుకు పోరాటాలు సాగిస్తామన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు గ్రామాల్లో ఇంకా నెమరు వేసుకుంటున్నారని పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని సిర్పూర్(టి), బెజ్జూర్ మండలాల్లో పర్యటించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, నాయకులు, ఖాజా సమియొద్దీన్, రాంప్రసాద్, శ్యామ్‌రావు, సామల రాజన్న, నీలయ్య, చిప్పకుర్తి దేవాజీ, షణ్ముఖ చారి విజయనిర్మల, అమృత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- జిల్లా కేంద్రంలో పారామిలిటరీ దళాలతో ఫ్లాగ్‌మార్చ్


ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఎస్పీ, అధికారులు, సిబ్బంది

ఆసిఫాబాద్: జిల్లాలో శాంతియుతంగా పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌక్ నుంచి శుక్రవారం పారామిలిటరీ దళాల ఫ్లాగ్‌మార్చ్‌ను ప్రారంభించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్, పొట్టి శ్రీరాములు చౌక్, వివేకానంద చౌక్, మార్కెట్ ఏరియా మీదుగా ఈ ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. ఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో పారామిలిటరీ దళాల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలు పరిశీలించి, వారికి దిశానిర్దేశం చేశారు.

పోలీసులకు ఉపయోగం

మావోయిస్టుల కదలికలు, ప్రత్యేక నిఘా కోసం గ్రేహౌండ్స్ శిక్షణ ఉపయోగపడుతుందని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న గ్రేహౌండ్స్ ప్రత్యేక శిక్షణను శుక్రవారం పరిశీలించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు నిర్వహించాల్సిన బాధ్యతలు, వాహన తనిఖీల్లో తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందితో కలిసి ఎస్పీ భోజనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు ఎస్పీ ప్రభాకర్, డీఎస్పీ సదయ్య, సీఐలు సతీశ్, శ్రీనివాస్, చిట్టిబాబు, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి 'సోయం'

- కాంగ్రెస్‌లో చేరనున్నారనే ప్రచారం
- 'హస్తం' హైకమాండ్ పాజిటివ్‌గా ఉందనే టాక్
- ఆదిలాబాద్ స్థానం పెండింగ్‌తో మొదలైన చర్చ
- పోటీలో ఉండటం ఖాయమంటున్న సిట్టింగ్ ఎంపీ


సోయం బాపూరావు, ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ

సాక్షి, ఆదిలాబాద్: బీజేపీ సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు మళ్లీ తెరపైకి వచ్చారు. ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నారనే ప్రచారం జోరందుకుంది. హస్తం పార్టీ హైకమాండ్ కూడా పాజిటివ్‌గా ఉందనే టాక్ మొదలైంది. గురువారం రాత్రి రాష్ట్రంలో ఐదు ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం ఆదిలాబాద్ స్థానం పెండింగ్ పెట్టడం వెనక ఇదే కారణమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. బీజేపీ టికెట్ గొడం నగేశ్‌కు కేటాయించిన తర్వాత సోయం కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం సాగింది. అయితే చేరికలు, అభ్యర్థి ఎంపిక పరిశీలన వేగవంతం చేయడంతో ఇక కాంగ్రెస్ ప్రక్రియ కొలిక్కి వచ్చిందని అందరూ భావించారు. అయితే తాజా రాజకీయాలు ఆసక్తిగా మారాయి. ఈ విషయమై సోయం బాపూరావును 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించినప్పుడు.. 'పార్టీ ఏదైనా.. తాను పోటీలో ఉండటం ఖాయం..' అని పేర్కొనడం గమనార్హం.

సీనియర్ నేతలను ఢీకొట్టగలరా..

కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అభ్యర్థి ఎంపిక విషయంలో కొద్ది రోజులుగా పరిణామాలు వేగంగా మారుతూ వచ్చాయి. చివరకు ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ, ఐటీడీఏ ఏపీవో ఆత్రం భాస్కర్ తమ పోస్టులకు స్వచ్ఛంద విరమణ ప్రకటించి సీఎం సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరిన తెలిసిన విధితమే. ఈ ఇద్దరి నుంచే ఎవరినైనా అభ్యర్థిగా ఎంపిక చేస్తారని ప్రచారం సాగింది. సుగుణ అనుచరులు సంబురాలు సైతం చేసుకున్నారు. అయితే ఒక్క రోజుకే పరిస్థితి మారిపోయింది. తాజాగా సోయం బాపూరావు కాంగ్రెస్‌లో చేరనున్నారనే ప్రచారం వారి అభ్యర్థిత్వం విషయంలో బ్రేక్ పడినట్టేననే చర్చ సాగుతుంది. బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు గొడం నగేశ్, ఆత్రం సక్కు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నారని, ఈ సీనియర్ నేతలను కొత్త నేతలు ఢీకొట్టగలుగుతారా.. అనే సమీకరణాల్లోనూ పార్టీ ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీంతో గోండు సామాజిక వర్గానికే చెందిన సిట్టింగ్ సోయంనే పార్టీలోకి చేర్చుకొని బరిలోకి దించాలని హైకమాండ్ పాజిటివ్‌గా ఉన్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా మనస్సు మార్చుకున్నారని చెబుతున్నారు. ఇదిలా ఉంటే సోయం బాపూరావుకు బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయానికి శనివారం రావాలని పిలుపు అందింది. గొడం నగేశ్‌కు సహకరించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జి తరుణ్ చుగ్ కోరేందుకే పిలిచారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సోయం పార్టీ కార్యాలయానికి వెళ్తారా.. లేదా అనేది ఆసక్తికరం. పోటీలో ఉండటం ఖాయమని చెబుతున్న నేపథ్యంలో బీజేపీ పెద్దలను ఆయన కలవకపోవచ్చనే ప్రచారం సాగుతుంది.

మరోవైపు లంబాడాకు ఇస్తారనే చర్చ..

రాష్ట్రంలో తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ ఆదిలాబాద్ విషయంలో చివరి క్షణంలో పెండింగ్ పెట్టిందన్న ప్రచారం విస్తృతంగా సాగుతుంది. కాగా ఈ పెండింగ్ విషయంలో లంబాడా సామాజికవర్గ కాంగ్రెస్ నేతలు మరో రకంగా చెబుతున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఆదివాసీ సామాజిక వర్గానికి టికెట్ కేటాయించిన దృష్ట్యా లంబాడా సామాజిక వర్గానికి కాంగ్రెస్ కేటాయించే యోచనలో ఉండడంతోనే పెండింగ్ పెట్టిందని చెబుతుండటం గమనార్హం. మహబూబాబాద్ టికెట్ లంబాడాకు కేటాయించడంతో ఆదిలాబాద్ స్థానం సమీకరణాల్లో భాగంగా ఆదివాసీకే కేటాయిస్తారనే ప్రచారం ఉన్నప్పటికీ రాష్ట్ర, దేశ వ్యాప్తంగా ఉన్న బంజారా జనాభా దృష్ట్యా పార్టీ ప్రయోజనాల కోసం లంబాడాకు ఇవ్వాలని యోచిస్తుందని చెప్పుకొస్తున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న నేతలను కూడా పార్టీ పరిశీలిస్తుందని చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్‌లలో ఎవరికైనా టికెట్ దక్కవచ్చనే ప్రచారం కూడా లేకపోలేదు. ఏదేమైనా కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు అయ్యే వరకు ఈ చర్చలు సాగే పరిస్థితి కనిపిస్తుంది. ఇదిలా ఉంటే హోలీ పండగ తర్వాత నిర్ణయం వెలువడవచ్చని పార్టీ నేతలు చెబుతున్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేశ్ కుమార్, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఆర్‌వో లోకేశ్వర్‌రావు, డీఎస్పీ సదయ్యతో కలిసి శుక్రవారం నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, గర్భిణుల కోసం ప్రతీ పోలింగ్ కేంద్రంలో ర్యాంపు సౌకర్యం కల్పించాలని సూచించారు. ఆసిఫాబాద్ నియోజవర్గంలో 51 సెక్టార్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతీ సెక్టోరల్ అధికారి తన రూట్ పరిశీలించాలని సూచించారు. సమస్యాత్మక షాడో పోలింగ్ కేంద్రాలు గుర్తించి, వివరాలు సమర్పించాలన్నారు. 85 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ కోసం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని ఎంపీడీవోలు, బూత్‌స్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ పోలింగ్‌కు ఒకరోజు ముందు మాక్‌పోలింగ్ నిర్వహించాలన్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాలన్నారు.

క్లుప్తంగా

అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఫిర్యాదు


ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: నియోజకవర్గంలోని పలు మద్యం దుకాణాల యజమానులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని శుక్రవారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ సామ్యూల్‌జాన్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. చింతలమానెపల్లి మండలం గూడెం మద్యం దుకాణం యజమాని మద్యాన్ని అధిక ధరకు అమ్ముతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్ములు మల్లయ్య, నాయకులు సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, గ్రామస్తులు శంకర్, దేవాజీ, సంజీవ్, పురుషోత్తం, మనోజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం


చెడ్వాయి శివారులో బెల్లం పానకాన్ని పారబోస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్/పెంచికల్‌పేట్: కాగజ్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని చెడ్వాయి, గన్నారం గ్రామాల్లో నాటుసారా తయారు చేసి అమ్ముతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ అధికారులు, డీటీఎఫ్ ఆసిఫాబాద్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ సామ్యూల్ జాన్ తెలిపారు. చెడ్వాయి గ్రామశివారులోని పెద్దవాగు సమీపంలో 2వేల లీటర్ల బెల్లం పానకాన్ని పారబోసినట్లు వివరించారు. ఎక్సైజ్ ఎస్సై సురేశ్, డీటీఎఫ్ ఎస్సై రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

జైనూర్: మండల కేంద్రానికి చెందిన దేవిదాస్ ఇంట్లో గుడుంబా నిల్వ చేశాడనే ముందస్తు సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇంట్లో నిల్వ చేసిన నాలుగు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

జీవో 94ను రద్దు చేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): జీవో 94ను రద్దు చేసి జీవో 22 ప్రకారం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. జీవో 94ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ, గోలేటి సీహెచ్‌పీ, నర్సరీల్లో కాంట్రాక్టు కార్మికుల సంతకాల సేకరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఐదేళ్లకోసారి సవరించాల్సిన కార్మికుల కనీస వేతనాల జీవోను 2012 నుంచి సవరించకపోవటంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. జీవో 22 ప్రకారం అన్‌స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనంగా రూ.18,019 నిర్ణయించగా, కొత్త జీవో ప్రకారం కార్మికుల కనీస వేతనాన్ని రూ.11,325గా నిర్ణయించి కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందన్నారు. జీవో 94ను రద్దు చేయాలని చేపట్టిన సంతకాల సేకరణ కాపీలను ఈనెల 28న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్‌కు అందజేస్తామని తెలిపారు. కార్మికులు బాలేస్, జబ్బార్, వెంకటేశ్, కొమురయ్య, పర్వతాలు, చారి, జగదీశ్, శారద, చిన్నుబాయి, అనిత, లక్ష్మి పాల్గొన్నారు.

తిరస్కరిస్తే పరిష్కారమైనట్లా?

- ఆందోళనకు గురి చేస్తున్న ధరణి
- మాడ్యూల్స్ సవరణకు అవకాశం
- అయినా దరఖాస్తులు పెండింగ్
- సమస్యలు పరిష్కరించేదెప్పుడో..!


తాండూర్ తహసీల్దార్ కార్యాలయం


తహసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్ సెక్షన్

తాండూర్: ఏళ్లు గడుస్తున్నా రైతుల భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. భూప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణిని అందుబాటులోకి తీసుకురాగా స్వల్ప కారణాలతో అనేకమంది రైతుల భూసమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. తాజాగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అపరిష్కృతంగా ఉన్న భూముల చిక్కుముడులు విప్పేందుకు ధరణి మాడ్యూల్స్‌లో సవరణలు చేసినా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా ఉండిపోయాయి. బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో తిరస్కరణకు గురైన భూదస్త్రాలు కూడా పరిష్కారమైనట్లు ధరణి వెబ్‌సైట్‌లో చూపిస్తుండడంతో మార్పే మీ లేకుండా పోయింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ధరణి మాడ్యూల్స్‌లో మార్పులు తీసుకువచ్చినా భూ సమస్యలు తీరకపోవడం రైతులకు శాపంగా మారింది.

ఆన్‌లైన్‌లో 2,107 దరఖాస్తులు

రెవెన్యూ డివిజన్ పరిధిలో బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, కన్నెపల్లి, భీమిని, నెన్నెల, వేమనపల్లి మండలాలున్నాయి. వీటి పరిధిలో భూసమస్యల పరిష్కారానికి రైతులు ఆన్‌లైన్‌లో 2,107 దరఖాస్తులు అందించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సత్వరంగా దరఖాస్తులను పరిశీలించి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఈ నెల 16వ తేదీ వరకు 1,340 దరఖాస్తులను పరిశీలించారు. ఇందులో 1,331 దరఖాస్తులను పరిష్కరించడానికి అవకాశాలున్నట్లు నిర్ధారణకు వచ్చారు. వీటిలో ఆర్డీవో పరిధిలో 82 దరఖాస్తులే పరిష్కారం కాగా, మిగతా దరఖాస్తులు తహసీల్దార్, కలెక్టర్ పరిధిలో అపరిష్కృతంగా ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా తహసీల్దార్ల స్థాయిలో 307 దరఖాస్తులు పరిష్కరించినట్లు చెబుతున్నారు. వీటిలో 95 శాతం మందివి తిరస్కరించినట్లుగా ఆన్‌లైన్‌లో చూపుతున్నారు. అయితే తిరస్కరణకు గురైన, అపరిష్కృతంగా ఉన్న భూముల దరఖాస్తులన్నీ పరిష్కారమైనట్లు రికార్డుల్లో చూపడం గమనార్హం. మరో వైపు 767 దరఖాస్తులు కనీసం పరిశీలనకు కూడా నోచుకోలేదు. కాగా, పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో ఒక్కసారిగా దరఖాస్తుల పరిశీలనకు బ్రేక్ పడింది. మరికొన్ని నెలలపాటు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా భూముల సమస్యలపై వచ్చి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు మరోసారి కొన్ని నెలల పాటు అటకెక్కాయి.

పరిష్కారం కాకుండానే..

భూముల సమస్యలు పరిష్కారం కాకపోయినా.. ధరణి ఆన్‌లైన్ రికార్డుల్లో పరిష్కారం చేసినట్లుగా గణాంకాలు వెల్లడవుతున్నాయి. పరిష్కారానికి అవకాశాలున్న భూదస్త్రాలతో పాటు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ పరిధిలోని భూముల దస్త్రాలూ పరిష్కారమైనట్లు ధరణి వెబ్‌సైట్‌లో చూపిస్తుండడంతో రైతులు నివ్వెరబోతున్నారు.

బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌లో ధరణి దరఖాస్తుల వివరాలు

ఆన్‌లైన్ దరఖాస్తులు	2,107
పరిశీలించిన దరఖాస్తులు	1,340
నిర్ధారణకు వచ్చినవి	1,331
తహసీల్దార్ పరిశీలించినవి	307
ఆర్డీవోకు రెఫర్ చేసినవి	393
ఆర్డీవో పరిధిలోని దరఖాస్తులు	82
కలెక్టర్‌కు పంపించినవి	197

జూన్ తర్వాతనే..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారానికి ఏ మాత్రం అవకాశాలు లేవు. రాష్ట్రంలో ఎంపీ ఎన్నికల పోలింగ్ మేలో జరిగి జూన్ మొదటి వారంలో ఫలితాలు వెల్లడవుతాయి. అనంతరం జూన్ 6న కేంద్ర ఎన్నికల సంఘం కోడ్ ఎత్తివేయనుంది. కోడ్ ఎత్తివేత అనంతరం మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తేనే అర్ధంతరంగా నిలిచిన ధరణి భూ సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉంటుంది. అప్పటివరకు బాధిత రైతులు నిరీక్షించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

కార్మికుల రక్షణపై శ్రద్ధ చూపాలి


కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణిలో కార్మికుల రక్షణపై యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ప్రమాదం జరిగిన ఎస్సార్పీ–1 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రమాదంలో కార్మికుడు సత్యనారాయణ రెండు కాళ్లు తెగిపోయి నడవలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేన శ్యాం, ఏరియా కార్యదర్శులు వెంగళ కుమారస్వామి, రావుల అనిల్, ఎంబడి తిరుపతి, నాయకులు సదయ్య, సతీశ్, వెంకటేశ్, శ్రీనివాస్, తిరుపతిరావు, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ కమాన్ సమీపంలో శుక్రవారం క్రేన్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో కిష్టాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్ ప్రయాణికులను కిష్టాపూర్ నుంచి మండల కేంద్రానికి తీసుకువస్తున్న క్రమంలో కమాన్ సమీపంలో రెబ్బెన బస్టాండ్ వైపు నుంచి వస్తున్న క్రేన్, ఆటో ఎదురెదురుగా ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న మహేశ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న 108 ఈఎంటీ పరశురాం, పైలట్ తిరుపతి మహేశ్‌ను అంబులెన్స్‌లో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మామిడి రైతులు గట్టెక్కేనా?


చెన్నూర్‌లో పూత, కాత నిలువని మామిడి చెట్టు

- ఈసారి నిలువని పూత, కాత
- దిగుబడిపై రైతుల దిగులు

చెన్నూర్: గతే సీజన్‌లో వివిధ రకాల వైరస్‌లు సోకి పంట నష్టపోయిన మామిడి రైతులకు ఈ సీజన్‌లోనూ నష్టాలు తప్పేలా లేవు. ఈ ఏడాది ముందుగా మామిడి పూత రైతులను మురిపించింది. ఆ తర్వాత వాతావరణంలో మార్పుల కారణంగా పిందెలు ఎర్రగా మారి రాలిపోయాయి. జిల్లాలోని భీమారం, జైపూర్, నెన్నెల, వేమనపల్లి, కోటపల్లి, చెన్నూర్, బెల్లంపల్లి మండలాల్లో 8,250 మంది రైతులకు చెందిన 18,170 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. 8,250 మంది మామిడి రైతుల్లో సుమారు 50శాతం మంది తోటలను 2వేల మంది రైతులకు కౌలుకిస్తున్నారు. వీరు పూత సమయంలోనే కౌలు చెల్లించారు. జిల్లాలో పచ్చడి కాయతో పాటు దసరి, బంగినపల్లి, చెరుకు రసం, కొత్తపల్లి కొబ్బరి, హిమాన్‌పసంద్, తోతపరి, పెద్ద రసాలు, గుంట్లీ, లగ్డా, పంచదార లాంటి మేలైన రకాలు పండుతుండగా వీటికి ఇతర రాష్ట్రాల్లోనూ డిమాండ్ ఉంది. ఏటా జిల్లా నుంచి వేలాది టన్నుల మామిడి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ఈ సారి పంట ఆశాజనకంగా లేకపోవడంతో ఎగుమతి కష్టమేనని రైతులు చెబుతున్నారు.

నాకు అప్పులే మిగుల్తయ్



చెన్నూర్, కోటపల్లి మండలాల్లో పదెకరాల మామిడి తోటలను రూ.30 లక్షలు అప్పు చేసి కౌలుకు తీసుకున్న. ఈసారి పూత బాగా వచ్చింది. కాత బాగుంటుందని ఆశపడ్డా. వాతావరణంలో వచ్చిన మార్పులతో కాయ ఎర్రబడి రాలింది. 20శాతం కూడా నిలువలేదు. ఏప్రిల్, మేలో గాలిదుమారాలు వస్తే అంతే సంగతి. నాకు అప్పులే మిగుల్తయ్. – నాయిని తిరుపతి, కౌలు రైతు

రైతులను ఆదుకోవాలె



నాకు ఆరెకరాల్లో మామిడి తోట ఉంది. పోయినేడాది మంగు తెగులు సోకి పెట్టిన పెట్టుబడి రాక నష్టాల పాలైన. గతేడాది నష్టాన్ని పూడ్చుకుందామని ఆశపడితే ఈసారి పూత రాలి పిందె నిలువలేదు. మూడేళ్ల క్రితం మామిడి తోటపై రూ.5 లక్షలు సంపాదించిన. రెండేళ్ల నుంచి నష్టాలే మిగులుతున్నయ్. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలె. – జనార్దన్, రైతు, నెన్నెల

బొగ్గు రవాణా మరింత పెంచాలి


సీహెచ్‌పీ వద్ద అధికారులకు సూచనలిస్తున్న డైరెక్టర్

శ్రీరాంపూర్: బొగ్గు రవాణాను మరింత పెంచాలని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు సూచించారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించారు. ముందుగా ఏరియా స్టోర్స్ అనంతరం ఓసీపీ సీహెచ్‌పీ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి ఎంత ముఖ్యమో.. దాన్ని సకాలంలో రవాణా చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. పనిముట్లు ఎప్పుడు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. యంత్రాల విడిభాగాలు కూడా ఎప్పటికప్పుడు సమకూర్చుకోవాలని తెలిపారు. ఓసీపీ వద్ద ఆయన కంట్రోల్‌రూం, సీ 2 కన్వేయర్ బెల్ట్, సెకండరీ సైజర్లను పరిశీలించారు. ఆయన వెంట శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, జనరల్ మేనేజర్ (స్టోర్స్) మాచరయ్య, ఎస్టోటూ డైరెక్టర్ కేవీ రావు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓసీపీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, అధికారులు కేశవరావు, యాదయ్య, రవీందర్, చంద్రశేఖర్, బ్రహ్మజీ పాల్గొన్నారు.

ప్రమాదస్థలిని పరిశీలించిన నాయకులు


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: ఎస్సార్పీ–1 గనిలో ప్రమాదం జరిగిన స్థలాన్ని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం సందర్శించారు. పుల్లీలో పడిన ప్రమాదంలో సత్యనారాయణ అనే హ్యామర్‌మెన్ కార్మికుడికి రెండు కాళ్లు విరిగిపోయాయి. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వీ సీతారామయ్య గనిలోకి దిగి ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిపై పెట్టిన శ్రద్ధ కార్మికుల రక్షణపై పెట్టనందునే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రక్షణ కోసం ఏర్పాటు చేయాల్సిన సేఫ్టీ ట్రైపార్టీయేట్ సమావేశాలను కూడా సక్రమంగా నిర్వహించడం లేదని విమర్శించారు. ఈ ప్రమాదానికి యాజమాన్యమే బాధ్యత వహించాలని, ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సత్యనారాయణకు పరామర్శ

కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణను సీతారామయ్య తదితరులు కలిసి పరామర్శించారు. ఆయనకు అందిస్తున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు. సత్యనారాయణకు మనోధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీతారామయ్యతో పాటు యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై ఆందోళన

- ఏసీపీ చొరవతో విరమణ


జరిగిన ఘటనను ఏసీపీకి వివరిస్తున్న బాలికలు

బెల్లంపల్లి: డిప్లొమా ద్వితీయ సంవత్సరం విద్యార్థిని భీముని వైష్ణవి ఆత్మహత్యకు కారకులపై చర్య తీసుకోవాలని శుక్రవారం బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులు ఆందోళనకు దిగారు. విద్యార్థి సంఘాల మద్దతుతో తరగతులు బహిష్కరించి మూడుగంటలపాటు ఆందోళన చేశారు. ఏసీపీ రవికుమార్, సీఐలు దేవయ్య, అఫ్జలుద్దీన్, ఎస్సైలు, సిబ్బందితో వచ్చి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఏసీపీ ఘటన వివరాలు విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, హెచ్‌వోడీ సాంబయ్య, హాస్టల్ మేనేజర్ నాగరాజు, అధ్యాపకులు ఫణికుమార్, మాలతిపై చర్య తీసుకోవాలని విద్యార్థులు నినదించారు. కాగా, భూపాలపల్లి జిల్లా చిట్యాల పోలీసులు స్థానిక పోలీసులకు ఫోన్ చేసి బాలిక మృతి ఘటనపై ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులు, హాస్టల్ మేనేజర్ మానసికంగా వేధించడంతోనే వైష్ణవి ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. ఈనెల 14న తోటి విద్యార్థిని బర్త్‌డే సందర్భంగా కేక్ కట్ చేయడాన్ని సీరియస్ గా తీసుకుని వీరు వైష్ణవిని దుర్భాషలాడారని తెలిపారు. మరుసటిరోజు ఆమె తల్లిదండ్రులను పిలిపించి వైష్ణవిని ఇంటికి పంపించారని పేర్కొన్నారు. దీంతో మనస్తాపం చెందిన వైష్ణవి 17న ఇంట్లో గుర్తు తెలియని మందు తాగినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఆమెను వరంగల్ ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందని వివరించారు. చదువులో చురుకుగా ఉండే వైష్ణవి ఆత్మహత్య ఘటనను జీర్ణించుకోలేక పోతున్నామని తోటి విద్యార్థినులు విలపించారు. ఆమె మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు ఆదర్శ్, సాగర్, చరణ్, రాజేంద్రప్రసాద్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

వాంకిడి: మండలంలోని ఎల్లానగర్ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లానగర్ గ్రామానికి చెందిన ముచ్చనేని సునీత (18) గురువారం మండల కేంద్రంలో నిర్వహించే సంతకు వెళ్లి వచ్చింది. శుక్రవారం తెల్లవారు జామున సునీత ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, గురువారం మహారాష్ట్రలోని సుగునాపురం గ్రామానికి చెందిన మోటి అంకుష్ అనే యువకుడు ఎల్లానగర్‌లోని సునీత ఇంటి ముందు రెండు, మూడుసార్లు చక్కర్లు కొట్టగా ఆమె అక్క సారక్క అతడిని నిలదీసింది. దీంతో అక్కడి నుంచి ఆ యువకుడు వెళ్లి తిరిగి మళ్లీ రాలేదు. కాగా, అంకుష్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ యువతి తల్లి గిర్జుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని రెండు వేర్వేరు చోట్ల శుక్రవారం పోలీసులు దాడి చేసి రూ.40 వేల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మందమర్రి సర్కిల్ పీఎస్‌లో శుక్రవారం సీఐ శశిధర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. చెంచు కాలనీకి చెందిన షారుఖ్ సమీపంలోని రైల్వే ట్రాక్ ఏరియాలో గంజాయి తరలిస్తున్నాడనే సమాచారం మేరకు అతడిని పట్టుకోగా 1,100 గ్రాముల గంజాయి లభించింది. అలాగే మారుతీనగర్‌కు చెందిన మక్కల గంగాధర్ అనే యువకుడు చెంచు కాలనీలో గంజాయి అమ్ముతున్నాడనే సమాచారం రాగా దాడి చేసి అతడి నుంచి 500గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయితో పట్టుబడ్డ వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడిలో పాల్గొన్న ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని అభినందించారు.

చోరీ నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎంసీసీ ఫ్యాక్టరీ నుంచి ఇనుప సామగ్రి చోరీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి ఎంసీసీ ఫ్యాక్టరీలోని ఓ స్టోర్ రూం తాళం పగులగొట్టి ఇనుప సామగ్రి ఎత్తుకెళ్లేందుకు యత్నించగా, ఇన్‌చార్జి విజయ్‌గోపాల్ వారిని బెదిరించాడు. దీంతో వారు తీసుకువచ్చిన ట్రాలీలను వదిలి పారిపోయారు. ఈ మేరకు విజయ్‌గోపాల్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలించారు. శుక్రవారం నిందితులు వదిలిపెట్టిన ట్రాలీలను తీసుకెళ్లేందుకు వస్తున్న క్రమంలో ప్రత్యేక టీం సభ్యులు వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరం అంగీకరించారు. దీంతో వారిపై కేసు నమోదు చేశారు. శ్రీరాంపూర్ అరుణక్క నగర్‌కు చెందిన మోతె రమేశ్, చున్నంబట్టి వాడకు చెందిన జనగామ దినేశ్, ఒడ్డెర కాలనీకి చెందిన కుక్క సమ్మయ్యను రిమాండ్ చేశారు. వీరి నుంచి ఒక ఆటో ట్రాలీ, రెండు ఆటోలు, రూ.50 వేల విలువైన ఇనుప వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

గత నెల 8వ తేదీన మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడకు చెందిన మాదంశెట్టి ప్రభాకర్‌పై జాఫర్‌నగర్‌కు చెందిన కిచ్చి అర్జు, రాథోడ్ భవన్ ఇద్దరు దాడికి పాల్పడినట్లు అతడి అల్లుడు పెద్ది భరత్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ప్రత్యేక బృందాలతో గాలించగా, గత నెల 27వ తేదీన కిచ్చి అర్జు అనే ప్రథమ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు రాథోడ్ భవన్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

ఇసుక దందాపై కొరడా

- 300 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక సీజ్
- రెండు లారీలు, జేసీబీ పట్టివేత

రెబ్బెన: మండలంలో కొనసాగుతున్న ఇసుక అక్రమ దందాపై విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టారు. పక్కా సమాచారంతో రీజియన్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు ఆదేశాల మేరకు గురువారం రాత్రి కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద కాపు కాశారు. అదే సమయంలో రెబ్బెన వైపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నారు. లారీలతోపాటు ఇసుక లోడింగ్‌కు ఉపయోగించిన జేసీబీని స్వాధీనం చేసుకుని రెబ్బెన పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం విజిలెన్స్, రెవెన్యూ అధికారులు గొల్లగూడ, పుంజుమేరగూడ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను గుర్తించారు. గొల్లగూడ సమీపంలో రెండు చోట్ల, జాతీయ రహదారి పక్కన ఉన్న ఇటుక బట్టీల వెనుక భాగంలో, పుంజుమేరగూడ బస్టాండ్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వెనుక భాగంలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 300 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను గుర్తించి సీజ్ చేశారు. ఈ మేరకు పంచనామా నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. విజిలెన్స్ సీఐలు వరుణ్‌ప్రసాద్, ప్రశాంత్‌రావు, ఎస్సై నారాయణ, ఆర్‌ఐ ప్రేమ్‌కిరణ్, విజిలెన్స్ సిబ్బంది అశోక్, అనిల్, సంపత్ పాల్గొన్నారు.

పాత మంచిర్యాల పరిధిలో 150కి పైగా ఇసుక డంపులు సీజ్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మధురానగర్, పాతమంచిర్యాల పరిధిలో 150కి పైగా ఇసుక కుప్పలను శుక్రవారం రెవెన్యూ, మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. మంచిర్యాల తహసీల్దార్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల ఆర్‌ఐ అజీజ్, మైనింగ్ ఎస్‌ఆర్‌వో రాహుల్.. తహసీల్దార్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. అనుమతి లేకుండా అక్రమంగా తరలించి కుప్పలుగా పోసి ఉన్న ఇసుకను సీజ్ చేసి మైనింగ్ ఏడీ బాలుకు అప్పగించారు. ఇసుకను అక్రమంగా తరలించి నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి మృతి


రాములు (ఫైల్)

సిర్పూర్(టి): ఈనెల 11న తప్పిపోయిన లారీ క్లీనర్ రంగపురం రాములు (45) ఈనెల 21న మృతిచెంది కనిపించాడు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం .. హైదరాబాద్‌కు చెందిన రాములు ఈనెల 11న తాను పనిచేసే లారీ మండలంలోని పెద్దబండ సమీపంలో చెడిపోగా గ్రామంలోకి వెళ్లి వస్తానని డ్రైవర్‌కు చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో అతడి భార్య చిట్టమ్మ ఫిర్యాదు చేసింది. ఈనెల 21న అచ్చెల్లి సమీప పత్తి చేనులో కుళ్లిన మృతదేహాన్ని గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ పోలీసులకు సమాచారం అందించాడు. వారు పరిశీలించి రాములు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని శుక్రవారం పరిశీలించగా రాములుదేనని అతడి భార్య చిట్టమ్మ గుర్తించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

వాంకిడి: కులం పేరుతో దూషించిన ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గేడం తారాబాయితో అదే గ్రామానికి చెందిన సయ్యద్, అమ్జద్, సాదిక్‌తో వాగ్వాదం జరిగింది. దీంతో వీరు గురువారం తారాబాయి ఇంట్లోకి ప్రవేశించి ఎస్టీ కులానికి చెందిన మహిళవు అంటూ కులం పేరుతో దూషించారు. దీనిపై తారాబాయి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధి గాంధీనగర్‌లో శివరాత్రి రాజు ఇంట్లో శుక్రవారం పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వీరి నుంచి రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పేకాడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.